

రేపు వైఎన్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

నరసాపురం: వైఎన్ కళాశాల హెచ్ఆర్‌డి సెంటర్‌లో ఈనెల 29వ తేదీ శనివారం నేషనల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిబిలిటీ అండ్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించబడతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో యాక్సిస్ బ్యాంక్, ఎపిఎసి ఫైనాన్షియల్ సర్వీసెస్, అపోలో ఫార్మసీస్, పేటియమ్, ముత్తూట్ ఫైనాన్స్ వంటి మొదలైన సంస్థల ప్రతినిధులు హాజరై ఎంపికలు నిర్వహిస్తారు. డిగ్రీ, పీజీ, ఎంబిఎ అర్హత కలిగిన విద్యార్థులు పాల్గొని ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ ఎంపికలకు వైఎన్ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర కళాశాల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు తమ బయోడేటా, అర్హత సర్టిఫికెట్లు తీసుకుని రావలసిందిగా తెలిపారు. ఇతర వివరములకు హెచ్ఆర్‌డి సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్ సెల్‌నెంబర్ 9440085679 ద్వారా సంప్రదించవలెనని తెలిపారు.

ధాన్యం డబ్బులివ్వండి.. మహాప్రభో..!



రెండు నెలలుగా అన్నదాతల ఎదురుచూపు

రెండు జిల్లాల్లో రూ.1,142 కోట్లు బకాయి

అప్పలకు వడ్డీ కట్టలేక, ఖరీఫ్ పనులకు సొమ్ములేక రైతులు లబోదిబో

వినతులిచ్చినా, ఆందోళనలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం

దిక్కుతోచని స్థితిలో ధాన్యం రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం సొమ్ము అందక అన్నదాత పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పండిన పంటను విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా సొమ్ము జమ చేయకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రబీలో తెచ్చిన అప్పులు తీర్చలేక, ఖరీఫ్ సాగుకు పెట్టుబడులు పుట్టక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రులు, ఎంఎల్ఎలు, అధికారులకు ఎన్ని వినతులిచ్చినా ప్రయోజనం లేకపోవడం మట్టి మనిషిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. గడిచిన రబీలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. రబీలో పశ్చిమగోదావరి జిల్లాలో 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అధికారులు ప్రణాళికలు రచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఏప్రిల్ 28వ తేదీకి ముందు రూ.400 కోట్లు వరకూ చెల్లింపులు చేశారు. ఆ తర్వాత ధాన్యం సొమ్ము జమ నిలిచిపోయింది. దీంతో ఇంకా రైతులకు అందాల్సిన రూ.900 కోట్లు బకాయి అలాగే ఉండిపోయింది. ఏలూరు జిల్లాలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించగా రెండు లక్షల 161 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మొత్తం రూ.439.01 కోట్లు విలువ చేసే ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటి వరకూ చెల్లించిన సొమ్ము కేవలం రూ.196.09 కోట్లు మాత్రమే. ఇంకా రూ.242 కోట్లు ధాన్యం సొమ్ము బకాయి ఉండిపోయింది. కొనుగోలు చేసిన ధాన్యంలో 40 శాతం సొమ్ము మాత్రమే చెల్లించారు. ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సొమ్ము అందకపోవడంతో రైతులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. పౌర సరఫరాలశాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఈ వారంలో, పది రోజుల్లో అంటూ అధికారులు మాటలు చెప్పడం మినహా డబ్బు మాత్రం జమ కావడం లేదు. రైతుసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వానికి పట్టని పరిస్థితి. రబీలో తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. కోత యంత్రాలకు, దుక్కు దున్నిన ట్రాక్టర్లకు, కూలీలకు సొమ్ము చెల్లించకపోవడంతో రైతులపై ఒత్తిడి పెరుగుతోంది. ఖరీఫ్ సాగు మొదలైంది. పిల్లలకు బడులు ప్రారంభమయ్యాయి. పెట్టుబడులకు, పిల్లల ఫీజులు, పుస్తకాల కొనుగోలుకు సైతం రైతుల చేతుల్లో చిల్లిగవ్వ లేక నానావస్థలు పడుతున్నారు. అసలు ఎప్పటికిస్తారో కూడా సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వం తొలుత రైతుల ధాన్యం డబ్బు జమ చేయాలని అన్నదాత కోరుతున్నాడు. ప్రభుత్వాలు మారినా రైతుల బతుకుల్లో మార్పులు రావడం లేదనే ఆవేదన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. ధాన్యం సొమ్ము జమపై ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



రూ.ఆరు లక్షలు ధాన్యం సొమ్ము జమకాక తీవ్ర ఇబ్బందులు

బైరెడ్డి లక్ష్మణరావు, కౌలురైతు, సుంకరవారితోట

రబీలో సాగు చేసిన పదెకరాల ధాన్యం మే మూడు, నాలుగు తేదీల్లో విక్రయించాను. రూ.ఆరు లక్షల సొమ్ము వరకూ రావాలి. దాదాపు రెండు నెలలు కావొస్తున్నా సొమ్ము జమ కాలేదు. అధికారుల వద్దకు వెళ్తే అదిగో.. ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారు. రబీలో పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేదు. ఖరీఫ్ సాగుకు ఎవరూ అప్పు ఇవ్వడం లేదు. దీంతో నరకయాతన అనుభవిస్తున్నాం. కొత్త ప్రభుత్వం పట్టించుకుని ధాన్యం సొమ్ము జమ చేయాలని కోరుతున్నాం.


అప్పల వాళ్ల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం



పోతురాజు, కౌలురైతు, ఏలూరు రూరల్

రబీలో ఎనిమిదెకరాలు సాగు చేశాను. 480 సారల ధాన్యం మే మొదటి వారంలో విక్రయించాను. ఇప్పటి వరకూ సొమ్ము జమ కాలేదు. పెట్టుబడుల కోసం అప్పు తెచ్చిన చోట ఒత్తిడి పెరుగుతోంది. ధాన్యం సొమ్ము అందలేదని చెప్పినా నమ్మడం లేదు. ఇప్పటికైనా ధాన్యం సొమ్ము వెంటనే జమచేయాలని కోరుతున్నాం.

ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలి



కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

ధాన్యం సొమ్ము చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే రూ.200 కోట్లకుపైగా రైతులకు అందాల్సి ఉంది. సొమ్ము అందక ఖరీఫ్ సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే ధాన్యం సొమ్ము ఇవ్వకపోతే రైతులతో కలిసి ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తాం.

నేడు విధుల్లోకి కొత్త కలెక్టర్



బాధ్యతలు స్వీకరించనున్న సి.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ పని చేస్తున్న సుమిత్‌కుమార్‌ను చిత్తూరు కలెక్టర్‌గా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. జిల్లాల పునర్విభజన తర్వాత తొలి కలెక్టర్‌గా పి.ప్రశాంతి నియమితులైన పని చేసిన సంగతి తెలిసిందే. ఆమె 2022 ఏప్రిల్ నాల్గో తేదీ నుంచి 2024 ఫిబ్రవరి 17వ తేదీ వరకూ జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. ఆమె బదిలీ అనంతరం జిల్లా కలెక్టర్‌గా సుమిత్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయన ఎన్నికల సమయంలో 2024 ఫిబ్రవరి 20 నుంచి కొద్ది నెలలు పని చేశారు. ఇటీవల బదిలీల్లో ఆయన చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సంగతి తెలిసిందే. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి నియమితులైన సంగతి తెలిసిందే. నాగరాణి తొలిసారి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమె గతంలో ఐటిడిఎ, గ్రామీణ ఉపాధి హామీ, చేనేత-జౌళి, సాంకేతిక విద్య వంటి కీలక శాఖల్లో పని చేశారు. 2011 నుండి 2014 వరకు ఐటిడిఎ పిఒగాను, తర్వాత గ్రామీణ ఉపాధి హామీ పనుల డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. చేనేత జౌళిశాఖ సంచాలకురాలిగా 2022 ఆగస్టు వరకు పని చేశారు. ప్రస్తుతం సాంకేతిక విద్యావిభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల బదిలీల్లో జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు.

ధాన్యం సొమ్ము వెంటనే ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - పెంటపాడు




సతీష్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

దాళ్వా ధాన్యం సొమ్ము వెంటనే విడుదల చేయాలని కోరుతూ రైతులు ఎపి రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని పరిమళ్ల రైతు భరోసా కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అగ్రికల్చరల్ అసిస్టెంట్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, రైతుసంఘం నాయకులు మరపట్ల దానయ్య మాట్లాడుతూ దాళ్వా ధాన్యం ఐకెపి ద్వారా అమ్మి సుమారు మూడు మాసాలు కావొస్తుందన్నారు. ఇప్పటికీ ధాన్యం సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయలేదన్నారు. నారుమళ్లు వేయాలని వ్యవసాయాధికారులు ఒత్తిడి చేస్తున్నారని, విత్తనాలు, ఎరువులు, కూలీలకు సొమ్ము ఎవరిస్తారని ప్రశ్నించారు. ధాన్యం సొమ్ము చెల్లిస్తే రైతులకు కొంత ఉపశమనం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గ, మాదాసు శ్రీను, తాడి సుబ్బయ్య, తాడి ప్రసాద్, కవల బాలాజీ, మాదాసు రమేష్, గిద్ద శివ, గిద్ద రాఘవులు, మొకమట్టల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి

తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని మెడికల్ హబ్‌గా తయారు చేస్తామని, మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో అత్యాధునిక సాంకేతిక టెస్టింగ్ యూనిట్లు ఉన్నాయని, వాటి ద్వారా నెలకు 22 వేల మందికి 90 రకాల పరీక్షలు చేసే అవకాశం ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో వాటిని మరింత అభివృద్ధి చేసి పేదల ప్రాణాలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య చికిత్సలు అందిస్తామన్నారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సహకారంతో ఆసుపత్రిలో ప్రత్యేక సదుపాయాల తోపాటు వైద్యుల నియామకం కోసం కృషి చేస్తానన్నారు. మరో 600 పడకలను పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యులు కూడా మెరుగైన సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎం తాతారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణమూర్తి, నేతలు కాళ్ల గోపి, ఏరుబండి సతీష్, యాదవ శివాజీ, కిషోర్ సాయి జగదీష్, వర్తనపల్లి కాశీ, పైబోయిన రఘు, పాలూరి వెంకటేశ్వరరావు, పుల్లా బాబి, గుండుమోగుల సురేష్, పైబోయిన వెంకటరామయ్య, నీలిపాల దినేష్ యాదవ్, బైయనపాలెపు ముఖేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కాటేసిన కరెంటు..!

వేర్వేరుచోట్ల విద్యుదాఘాతానికి తల్లీకొడుకు, భార్యాభర్తలు దుర్మరణం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి, తాడేపల్లిగూడెం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గురువారం విద్యుత్ తీగలు యమపాశాలుగా మారాయి. వేర్వేరుచోట్ల విద్యుద్ఘాతానికి గురై నలుగురు మృతి చెందడం అందరినీ కలిచివేసింది. ఏలూరు జిల్లాలో తల్లీ కొడుకు మృతి చెందగా, పశ్చిమగోదావరి జిల్లాలో దంపతులు దుర్మరణం పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలోని ఈదర రావిచెట్టు సెంటర్ వద్ద దళితవాడలో దొండపాటి నాగరత్నం (62) తన ఇద్దరు కుమారుల వద్ద ఉంటోంది. గురువారం కూలి పనికి వెళ్లొచ్చిన నాగరత్నం అప్పటికే వర్షం పడి ఆగడంతో బయట తీగపై బట్టలు ఆరవేస్తోంది. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో నాగరత్నం విద్యుద్ఘాతానికి గురైంది. ఆమె పెద్దగా కేకలు వేయడంతో గమనించిన ఆమె పెద్ద కుమారుడు దొండపాటి రామదాసు (44) పక్షవాత బాధితుడైనప్పటికీ తల్లిని కాపాడాలనే తపనలో ఆమెను పట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో రామదాసు కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో తల్లీ కొడుకు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మృతుడు దొండపాటి రామదాసుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామదాసు భార్య సుభాషిణి ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేశారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దంపతులు దుర్మరణం

విద్యుదాఘాతానికి భార్యాభర్తలు దుర్మరణం పాలైన ఘటన గురువారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని ఆరోవార్డులో గాంధీబొమ్మ సెంటర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గట్టెం అన్నపూర్ణ (55), భర్త గట్టెం వెంకన్న (60) ప్రతిరోజూ ఉదయం పూట టిఫిన్ వ్యాపారం చేస్తున్నారు. దీనికోసం గురువారం సాయంత్రం అన్నపూర్ణ ఇడ్లీ పిండి ఆడేందుకు మోటార్ స్విచ్‌ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన భర్త వెంకన్న సైతం విద్యుదాఘాతానికి గురై ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. వీరికి వివాహితులైన ఒక కొడుకు, ఒక కుమార్తె ఉన్నారని, వారు వేరేచోట ఉంటున్నారని స్థానికులు తెలిపారు. పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ఎంఎల్ఎ బొలిశెట్టి దిగ్భ్రాంతి

విద్యుదాఘాతానికి దంపతుల మృతిపై ఎంఎల్ఎ బొలిశెట్టి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలిని ఆయన పరిశీలించి కారణాలు పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబీకులకు రూ.పది వేలు ఆర్థిక సాయం ఎంఎల్ఎ అందజేశారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మా సమస్యలు పరిష్కరించండి

ఎంఎల్‌సి లక్ష్మణరావుకు ఆరోగ్య మిత్రాల వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత 16 సంవత్సరాలుగా రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఆరోగ్య మిత్రాలుగా పని చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆరోగ్య మిత్రాలు కృష్ణ గుంటూరు ఉభయ జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణ రావును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం తమను మోసం చేసిందని ఈ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని, అందుకు మీరు కృషి చేయాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తక్షణమే ఆరోగ్య మిత్ర పెండింగ్ జీతాలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆరోగ్య మిత్రాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పథకం కింద జులై ఒకటో తేదీన పెన్షన్ సొమ్ము పంపిణీకి పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాలు నుండి ఎన్‌టిఆర్ భరోసా పథకం పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సమీక్షించారు. భీమవరంలోని కలెక్టరేటులో వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ కోసం శనివారం బ్యాంకుల ద్వారా నిధులు విత్‌డ్రా చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనిలో భాగంగా 50 హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేపట్టాల్సి ఉందని, శుక్రవారంలోపు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పెండింగ్ ఉన్న హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పూర్తి చేస్తామన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం జిల్లా జిల్లా ఎస్‌పితో మాట్లాడామని, పెన్షన్ల పంపిణీ లో అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు. పెన్షన్ల పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకుంటారన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం అవసరమైన అదనపు సిబ్బంది ఏర్పాటుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, పెన్షన్ల పంపిణీ కోసం మండల స్థాయిలో అధికారులకు దిశా నిర్దేశం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా అభివృద్ధి అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్. వేణుగోపాల్, డిఎల్‌డిఒ ఎవి.అప్పారావు, ఎపిఒ టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



1న 6 గంటల నుంచే పెన్షన్ సొమ్ము పంపిణీ జరగాలి

జిల్లాలో 2,32,885 మంది పెన్షన్‌దారులకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా జులై నెల ఒకటో తేదీన రూ.155.71 కోట్లు ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జులై ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకు ఎట్టి పరిస్థితుల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలని ఆదేశించారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపిడిఒలు దీనికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. జులై ఒకటో తేదీన అందుబాటులో ఉన్న ఏఒక్కరికీ పెన్షన్ అందలేదనే ఫిర్యాదు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో శానిటేషన్ పక్కాగా నిర్వహించాలన్నారు. తహశీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న వివిధ ధ్రువపత్రాలను వెంటనే జారీ చేయాలని తెలిపారు.

పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలోని పలు మండలాల్లో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నరసాపురంలో 87.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తణుకులో 9.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాలకొల్లులో 72.4, భీమవరం 70.4, ఉండి 68.8, వీరవాసరం 59.2, పాలకోడేరు 52.2, ఆకివీడు 47.4, గణపవరం 46.4, యలమంచిలి, కాళ్ల 40.2, పెనుగొండ 38.2, ఆచంట 38.0, పెనుమంట్ర 37.8, పోడూరు 30.4, అత్తిలి 25.2, మొగల్తూరు 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లాలోని మొత్తం 20 మండలాల్లో 840.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లా యావరేజ్ వర్షపాతం 42.0 మిల్లీమీటర్లు నమోదైంది.

ఆచంట: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత వారం రోజులుగా ఎండ వేడిమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం సుమారు 15 సెంటీమీటర్ల వరకూ నమోదైంది. ఇప్పటి వరకూ అధిక వేడిమితో ఉక్కపోతతో, నిద్రలేమితో వృద్ధులు, చిన్నారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపు లేకుండా వాన కురిసింది. గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణ మార్పులతో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందారు. గ్రామాల్లో ఎక్కడా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రహదారిపై నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారిపై నిలిచిన నీటిని బయటికి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం పడింది. దీంతో ప్రజా జీవనంకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పట్టణంలో రోడ్లు, డ్రెయిన్లు ఏకమై పారుతున్నాయి. చిరు వ్యాపారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో కనీసం పాల ప్యాకెట్లు కూడా తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. మధ్యాహ్నం నుంచి వర్షం తీవ్రత తగ్గింది. రోజంతా చినుకులు పడుతున్నాయి. వర్షంతో ఖరీఫ్ ఆకుమళ్లు వేయడానికి రైతులు సమాయాత్తం అయ్యే అవకాశం ఉంది.

ఆకివీడులో చెరువుల్ని తలపిస్తున్న రోడ్లు..

ఆకివీడు : స్థానిక నగర పంచాయతీ పరిధిలోని రోడ్లు చిన్నపాటి వర్షాలకే చెరువులుగా మారుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. పట్టణంలో ఎక్కడా డ్రెయిన్ల పూడికతీత సక్రమంగా సాగటం లేదు. దీంతో లోతట్టు ప్రాంతాల్లో దుర్భర పరిస్థితులు నెలకొంటున్నాయి. గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి 20వ వార్డు పరిధిలోని మాదివాడ, మోటుపల్లివారి వీధిలో రోడ్లు పిల్ల కాలువలను తలపిస్తున్నాయి. దీనిపై తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క నిత్యం వందలాది మంది నడిచే రోడ్లో నీరు నిలిచిపోవడంతో రోడ్లలో నడుస్తుంటే ప్రజలు పడిపోతున్నారు. ఇటీవల వానలకు స్థానికులు ఇద్దరు పడిపోయి దెబ్బల పాలయ్యారు. రోడ్లు పల్లంగా ఉండటంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెనుమంట్ర : మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. మండలంలో 37.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఈ వర్షాలు సార్వా వరి నారుమళ్లకు అవసరం అని పలువురు రైతులు తెలిపారు. అయితే లోతట్టు ప్రాంతాల్లో నీరుచేరినందున పశువులు, కోళ్ల పెంపకం దారులు అవస్థలు పడ్డారు.

వర్షానికి జలమయమైన ప్రభుత్వ పాఠశాల ఆవరణ


పాలకొల్లు రూరల్ : మండలంలోని లంకల కోడేరు గ్రామ పరిధిలోని వెదుళ్ల పాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణ వర్షానికి జలమయమైంది. వర్షపు నీటిలో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గురువారం కురిసిన వర్షానికి డ్రెయిన్లు నిండిపోయి పొంగి పొర్లుతున్నాయి. పాఠశాల ఆవరణలో చేరిన వర్షపు నీటిలో డ్రెయిన్ నీళ్లు కూడా కలిసిపోయి దుర్గంధంగా మారింది. దీంతో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఎప్పటికప్పుడు స్కూల్ ఆవరణలో నీళ్లు నిల్వ ఉండకుండా వెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జలమయమైన పాఠశాల ఆవరణ

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ


పాలకొల్లు రూరల్: విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న సర్పంచి

విద్యార్థులకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని గోరింటాడ గ్రామంలో ఒకటి, రెండు పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను సర్పంచి మండేల పావని నాని చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థితికి రావాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా భావించి మంచి విద్యాబోధన చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ, వార్డు నెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నరసాపురం: పట్టణంలోని మిషన్ హై స్కూల్, మండలంలోని లింగనబోయిన చర్ల గ్రామం జెడ్‌పి హైస్కూల్‌లో గురువారం స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ విచ్చేశారు. అనంతరం గ్రామంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేసి మాట్లాడారు.

పాలకొల్లు రూరల్: పాలకొల్లు మండలం పాలమూరు ఎంపిపి స్కూల్‌లో ప్రభుత్వంచే మంజూరు చేయబడిన స్కూల్ బ్యాగ్స్, బుక్స్, బెల్టు, షూస్ సర్పంచి పంచదార వెంకట లక్ష్మీ నారాయణ స్వామి నాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకుని బాగా చదువుకుని అభివృద్ధి పథంలో పయనించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి టి.వరప్రసాద్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.ప్రకాష్, సహ ఉపాధ్యాయులు మహేష్, టిడిపి అధ్యక్షులు పణతుల మణిబాబు, జనసేన అధ్యక్షులు పి.రమేష్, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ విదేశీ విద్య' కొనసాగింపుపై హర్షం

ప్రజాశక్తి - ఉండి

అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని కొనసాగించడంపై టిడిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గొల్ల విక్టర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విక్టర్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చి దళిత విద్యార్థులకు తీరని అన్యాయం చేశారని గొల్ల విక్టర్ బాబు అన్నారు. ఎన్‌డియే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా అంబేద్కర్ విదేశీ విద్యా యోజన పథకాన్ని కొనసాగించడం హర్షణీయమన్నారు. 2015లో ఏర్పడిన అంబేద్కర్ విదేశీ విద్యా యోజన పథకాన్ని రాష్ట్రాల పరిధిలో బలహీన వర్గాల చదువుకు షెడ్యూల్ కులాల నుంచి విదేశీ విద్య చదువుకోటానికి ఎంతగానో ఉపయోగపడే ఈ పథకం పేరును మార్చి వందల కోట్ల రూపాయలను దుర్వినియోగం చేసి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళిత విద్యార్థులకు తీరని అన్యాయం చేశారని గొల్ల విక్టర్ బాబు అన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకి దళితుల ఆత్మ గౌరవం నిలబెట్టే దిశగా అంబేద్కర్ విదేశీ విద్య పేరు మార్చటం సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర దళిత సామాజిక వర్గం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

30న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నరసాపురం పట్టణం 31వ వార్డు చినమామిడిపల్లి గ్రామంలో నాగారమ్మ గుడి వద్ద ఈ నెల 30న ఉచిత ఆక్యు పంక్చర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు తెలిపారు. తల, మెడ, మడమ, మోకాళ్ళ తదితర దీర్ఘకాలిక నొప్పులు, స్త్రీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు, కొవ్వలి ఫౌండేషన్ నిర్వాహకులు కొండా శ్రీధర్ ఆక్యుపంక్చర్ ఉచిత వైద్యం ద్వారా ఉపశమనం కల్పిస్తున్నారు. నరసాపురం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వలి రామ్మోహన్ నాయుడు కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9985678881 సంప్రదించాలని సూచించారు.

ఎంఎల్‌ఎ నాయకర్‌చే పిహెచ్‌సి పరిశీలన

నరసాపురం:ఎల్‌బిచర్లలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ గురువారం పరిశీలించారు. పాత భవనం కూల్చి నూతన భవనం కట్టకుండా పాత భవనం పైనే స్లాబ్ వేశారని, ఇది ప్రమాదమని గ్రామస్థులు నాయకర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్ అండ్ బి అధికారులకు నాయకర్ పలు సూచనలు చేశారు. రావులపాలెం ఛానల్‌లో సాగుకు నీరు అందడం లేదని, కనీసం పశువులను తాగడానికి కూడా నీళ్ళు ఉండటం లేదని నాయకర్ దృష్టికి తీసుకువచ్చారు.

కిషోర్‌కు మురళీకృష్ణ పరామర్శ

నరసాపురం: మండలంలోని చామకూరి పాలెం పంచాయతీ కొండవీటి కొడప గ్రామానికి చెందిన జనసేన పంచాయతీ వార్డు మెంబర్ కిషోర్ ఇటీవల కాలంలో ఆక్సిడెంట్‌కు గురై కాలుకి సర్జరీ చేయించుకున్నారు. కిశోర్ ఇంటికి గురువారం జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీ కృష్ణ(చిన్నా) వెళ్లి కిషోర్ రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రేపు జాయింట్ యాక్షన్ కమిటీ

నరసాపురం: నరసాపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎంవి.రమణ రావు తెలిపారు. 2023-24 సంవత్సరంకు పాటదారుడు సిహెచ్ ధవేజి బకాయి చెల్లించక పోవడంతో తీసుకోవాల్సిన న్యాయపరంగా బకాయి సొమ్మును వసూలు చేసే విషయంపై తగుచర్యలు నిమిత్తం సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు గాయాలు

ఉండి: రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు గాయాలైన సంఘటన ఉండి మండలం కోలమూరులో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిడమర్రు మండలం మందలపర్రు గ్రామానికి చెందిన సరిపల్లె వెంకట సత్యనారాయణ రాజు తన కుమారునితో కలిసి బుధవారం ఉదయం భీమవరం ఆస్పత్రికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో కోలమూరు గ్రామం వచ్చేసరికి ఎదురుగా నిర్లక్ష్యంగా అతివేగంతో వస్తున్న ఆటో మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో తండ్రి, కొడుకులకు గాయాలు కాగా వారిని భీమవరం ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వారిచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు గురువారం ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎస్ఇబి సిఐ కె.స్వరాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన పరిసరాలు, మన చుట్టుపక్కల వారు, స్నేహితులు మంచివైతే మనకు మంచి జరుగుతుందని, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఇబి సిఐ కె.స్వరాజ్యలక్ష్మి అన్నారు. గురువారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సిఎస్ఎన్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ స్వరాజ్య లక్ష్మి మాట్లాడుతూ సరదాగా అలవాటైన డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తుందని, యువత డ్రగ్స్‌కి దగ్గరైతే దుర్భర స్థితిలోకి దారి తీస్తుందని అన్నారు. కళాశాల కార్యదర్శి చీడే సత్యనారాయణ మాట్లాడుతూ యువత డ్రగ్స్ పట్ల మక్కువ చూపటం వారి జీవితాలు నాశనమేనని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 3 రోజులపాటు వివిధ పాఠశాల, కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎండి నబీల్ ఖాన్, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ జి.సూకరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సిఐ కె.స్వరాజ్యలక్ష్మి

జంతువులనూ ఆదరించాలి

జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీకృష్ణ

భీమవరం టౌన్:మనుషులతో పాటు జంతువులకు కూడా ఎన్నో హక్కులు ఉంటాయని, వాటిని హింసించడం దారుణమని, మూగ జీవాలపై ఆదరణ చూపాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీకృష్ణ శుక్రవారం అన్నారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు హక్కుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమాన్ని బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ జంతు ప్రేమికులు మూగ జీవాలను కుటుంబంలో సభ్యులుగా పెంచుతారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఇ.ఎలీషా, అసిస్టెంట్ డైరెక్టర్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ జంతువుల పట్ల ఆదరణ చూపించాలని అన్నారు. వాటి పరిరక్షణలో ఉల్లంఘన చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గత వారం రోజులుగా జంతువుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలు కార్యాలయాల్లో చంద్రబాబు, పవన్ ఫొటోలు

ప్రజాశక్తి - మొగల్తూరు


మండల కేంద్రం మొగల్తూరులోని పలు కార్యాలయాల్లో రాజకీయ ప్రముఖుల ఫొటోలను గురువారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మొగల్తూరు పంచాయతీ కార్యాలయం, సచివాలయాలు, సొసైటీ కార్యాలయాల్లో ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, స్థానిక ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ఫొటోలను కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు కొల్లాటి గోపి, నాయకులు కొల్లాటి భోగరాజు, బస్వాని ఏడుకొండలు, బొక్క చంటి, లక్కు బాబి, అందే కొండ, కౌరు శ్రీను, గుండు రాజా, శ్రీను, దంపనబోయిన సత్యనారాయణ, పలువురు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.


యలమంచిలి: ఫొటోలను ఏర్పాటు చేస్తున్న నేతలు

యలమంచిలి: మండలంలోని వడ్డిలంక గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కడలి గోపాలరావు, గ్రామ సర్పంచి అడబాల చిట్టి నాయుడు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, ఆ చిత్రపటాలను స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా తయారైన గ్రామాలలో రానున్న రోజుల్లో రహదారులు, డ్రెయిన్లు, మెరుగైన పారిశుధ్యంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుబాటులోకి రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు అడ్డాల శ్రీనివాస్, స్థానిక నాయకులు శీలం రామకృష్ణ, గంటా వెంకటేశ్వరరావు, ఎర్రంశెట్టి రాములు, గంట ఉమామహేశ్వరరావు, కామన నరసింహరావు, మల్లికార్జునరావు, అద్దంకి తాతారావు పాల్గొన్నారు.

మానవత నూతన అధ్యక్షులుగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



తాడేపల్లిగూడెం మానవత నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మానవత జిల్లా కమిటీ సభ్యురాలు ఘట్టం సింధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షులుగా పత్స వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. కార్యదర్శిగా యర్రా ఆంజనేయస్వామి, కోశాధికారిగా యెగ్గిన శరత్ బాబు, ఉపాధ్యక్షులుగా దువ్వా శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా కురుమేళ్ల వెంకటాచలం ఎన్నికయ్యారు. ఎడ్యుకేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఊడిమూడి శ్రీనివాసరాజు, హెల్త్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కొల్లి రాజశేఖర్, అవేర్నెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జనపనేని రాజేంద్ర కుమార్, ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బండారు సీతారాం ఎన్నికయ్యారు. అలాగే అడ్వైజరీ కమిటీగా పాటి నాగేశ్వరరావు, బోడశృంగి హరికుమార్, కురుమేళ్ల బాలకృష్ణ, చెప్పాడ గురుమూర్తి, తమరాడ చిన్న, సమయవంతులు కాశి, బండి ధనలక్ష్మి, కాకర్ల నవీన్ బాబు, ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈనెల 30న మానవత నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సుబ్బారావు పేట బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని మానవత జిల్లా కమిటీ సభ్యురాలు గట్టిం సింధు తెలిపారు.

'ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి'

కాళ్ల : ఉండి నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. పెదఅమిరంలోని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణం రాజు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ వెంకయ్య వయ్యేరు పంట కాలువపై ఆధారపడిన గ్రామాలకు కలుషితం నీరు అందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాలువపై ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. పరిమెళ్ల లాకుల నుంచి జువ్వలపాలెం వరకు ఏర్పాటు చేసిన పైపులైన్ పనుల రూ.30 కోట్ల ప్రాజెక్టును పునరుద్ధరించాలన్నారు. ఈ ప్రాజెక్టులో ఎక్కడైనా పైపులైన్లు లీకేజీలు ఉంటే గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ బివివి.నాగేశ్వరావు, డిఇ కె.ధనానంద్, కాళ్ల ఆర్‌బ్ల్యూఎస్ ఎఇ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రబీ బకాయిలను చెల్లించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రబీ ధాన్యం బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఎకరాకు రూ.20 వేలు సార్వాకు సాగు సాయమందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. రైతాంగం సమస్యలు పరిష్కరించాలి డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం అధ్వర్యంలో రైతులు గురువారం భీమవరం తహశీల్దార్ శివకుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ గత రబీ ధాన్యం బకాయిలు ఇప్పటికీ చెల్లించకపోవడం దారుణమని, వాటిని వెంటనే చెల్లించాలని, సార్వా సాగు సాయం అందించాలని కోరారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ఆచంట: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు 'ప్రేమే మార్గం.. సేవే లక్ష్యం' పేరుతో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ అధినేత నల్లా రామకృష్ణ అన్నారు. వల్లూరు పంచాయతీ పరిధి శీలం వారిపాలెం గ్రామానికి చెందిన నల్లా రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రేమే మార్గం.. సేవే లక్ష్యం పేరుతో చారిటబుల్ ట్రస్ట్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదలకు ఉచితంగా నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ వల్లూరు పరిసర గ్రామాల్లో విద్య, వైద్యం సేవలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నూతనంగా ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. గ్రామంలో పేద వర్గాలకు ట్రస్ట్ ద్వారా తన వంతు సేవా కార్యక్రమాలు అందిస్తానని ఆయన తెలిపారు.

ఘనంగా హెలెన్ కిల్లర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


హెలెన్ కిల్లర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు


తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణం రాజు ఆధ్వర్యంలో హెలెన్ కిల్లర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా హెలెన్ కిల్లర్ చిత్రపటానికి మండల విద్యాశాఖ అధికారి-2 పిఎంవికె.జ్యోతి, సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త సిహెచ్.సుబ్రమణ్యం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ హెలెన్ కిల్లర్ పుట్టుకతో చెవిటి, మూగ, అందత్వంతో జన్మించినా, వైకల్యం అధిగమించి వాసన, స్పర్శ ద్వారా విద్యను అభ్యసించారని హెలెన్ కిల్లర్ జీవిత విశేషాలు విద్యార్థులకు వివరించారు. సహిత విద్య సమన్వయకర్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్ వికలాంగ పిల్లలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. చదువుకోవటానికి వైకల్యం అడ్డం కాదని హెలెన్ కిల్లర్ నిరూపించారని, వికలాంగ పిల్లల తల్లిదండ్రులు హెలెన్ కిల్లర్‌ను ఆదర్శంగా తీసుకొని పిల్లలను చదివించాలని, సమగ్ర శిక్ష వికలాంగుల పిల్లలకు అండగా ఉంటుందని అన్నారు. భవిత కేంద్రాలల్లో వికలాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్స్, పలకలు, స్నాక్స్ అందజేసి వికలాంగ పిల్లలకు తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.జ్యోతి, ఉపాధ్యాయులు, వికలాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాగు, తాగునీరు అందించడమే లక్ష్యం

ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

బృహత్తర సంకల్పంతో పంట కాలువలను అభివృద్ధి చేసి సాగు, తాగునీరు అందించాలనేది తన లక్ష్యమని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. పెద అమిరంలోని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు కార్యాలయంలో ఆకివీడు జెడ్‌పిటిసి యండగండి శ్రీను ఉండి ఇరిగేషన్ ఇన్ఫ్రాక్ట్ స్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్‌కి రూ.లక్ష చెక్కును ఉండి ఎంఎల్‌ఎకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా యండగండి శ్రీను మాట్లాడుతూ ఈ బృహత్తర సంకల్పం తలపెట్టి రైతుల నుంచి నిధులు సేకరించి పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నందుకు ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజును జెడ్‌పిటిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల రత్నం పాల్గొన్నారు.


రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఆకివీడు జెడ్‌పిటిసి యండగండి శ్రీను

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరి శుభ్రత పాటించి, దోమల ద్వారా వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట వేయాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. గురువారం పట్టణ ఎన్‌టిఆర్ జంక్షన్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 9వ వార్డులో కీటక జనిత ప్రదేశాల గుర్తించుటపై సిబ్బందికి అవగాహన, మలేరియా మాడోత్సవాలపై అవగాహన సదస్సులు, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటిని నియంత్రించవలసిన ప్రాధాన్యతను ప్రజలల్లో అవగాహన కల్పించటానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. దోమల నియంత్రణ అందరి బాధ్యత అన్నారు. సాధారణ జ్వరం అయినా, చలితో కూడుకున్న జ్వరం అయినా అశ్రద్ధ చేయకుండా సమీపంలోని ఆశా, వార్డు, ఆరోగ్య కార్యదర్శులను సంప్రదించాలని, ప్రాథమిక పరీక్షలు, నిర్ధారణ పరీక్షలు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని వాటిని సద్వినియోగపర్చుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: ఈనెల 29వ తేదీ శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఆయా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను ఉభయ పార్టీల సమక్షంలో సమన్యాయం అందించుటలో పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని నరసాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగ రాజు అన్నారు. గురువారం కోర్ట్ హాల్‌లో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కోర్టులలో పెండింగ్ తగ్గించడానికి, కక్షిదారులకు కేసుల నుంచి త్వరితగతిన ఉపశమనం పొందడానికి ఈ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కానీ సరైన అవగాహన లేకపోవడం వల్ల రాజీకి ముందుకు రాలేకపోతున్నారన్నారు. అందుకే మధ్యవర్తిత్వం ద్వారా కూడా రాజీయే రాజ మార్గం అని కక్షిదారులకి తెలియజేయాలని పోలీసులను ఆదేశించారు. క్షణికావేశంలో చేసిన నేరాన్ని సమాధానంతో పరిష్కరించడానికి ప్రయత్నం చేయాలన్నారు. తప్పని పరిస్థితుల్లో కోర్టుకి రాలేని వారు వారికి సమీపంలో ఉన్న కోర్ట్ వద్దకు వెళ్లి గూగుల్ మీట్ ద్వారా కూడా కేసులను రాజీ చేసుకోవచ్చునని, ఈసారి జరిగే లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు రాజీ చేయడానికి అందరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్, నరసాపురం టౌన్ సిఐ కె.అప్పల స్వామి, ఎపిపి ఎం.ఎ.హమీద్, రూరల్ ఎస్ఐ కె.గురవయ్య పాల్గొన్నారు.

12 వరకు బడిబయట పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి - కాళ్ల

సర్వశిక్ష అభియాన్ ఆదేశాల మేరకు జూలై 12వ తేదీ వరకూ బడి బయట పిల్లలను గుర్తించనున్నట్లు కాళ్ల ఎంఇఒ ఎ.రవీంద్ర తెలిపారు. గురువారం మండలంలోని ఏలూరుపాడులో విద్యాశాఖ ఆధ్వర్యంలో 'మేము బడికి పోదాం' కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరుపాడు మెయిన్ స్కూల్ హెచ్ఎం బి.శివనాగ జ్యోతి, ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు వెంకన్నబాబు, అప్పారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేందుకు సహకరించాలని ఎఎస్‌పి భీమారావు సూచించారు. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన ప్రజలతో ఆయన గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని అన్నిచోట్ల శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలందరూ సహకరించారని అన్నారు. ఎన్నికల అనంతరం కూడా ప్రశాంతకర వాతావరణం కోసం గ్రామాల్లో శాంతి కమిటీ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి గంటి శ్రీనివాసరావు, సిఐ కె.గోవిందరాజు, ఎస్ఐ కె.వెంకటరమణ ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు

తణుకు డివిజన్ ఎడిఎ రమేష్

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తణుకు డివిజన్ ఎడిఎ రమేష్ తెలిపారు. మండలంలోని గ్రామాల్లోని వరి విత్తన విక్రయాల దుకాణాలను గురువారం సాయంత్రం ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. దుకాణాల లైసెన్స్ పరిశీలించారు. విత్తనాలు సర్టిఫైడ్ కంపెనీ నుంచి వచ్చినవా కాదా అని నిర్ధారించుకున్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖాధికారి అబ్దుల్ రహీం ఉన్నారు.

అందుబాటులో పాము, కుక్క కాటుకు వ్యాక్సిన్లు

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పాము, కుక్క కాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్, తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుక్క కాటుకు 360 వ్యాక్సిన్లు, పాము కాటుకు 320 వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఈ వ్యాక్సిన్లు ఉపయోగించుకోవాలన్నారు.

మావుళ్లమ్మ జ్యేష్ఠ మాస జాతర ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పట్టణంలో వేంచేసియున్న మావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ఠ మాసం జాతర మహోత్సవములు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ జాతర మహోత్సవాలను స్థానిక ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రారంభించారు. దేవస్థానము, నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆహ్వానంతో విచ్చేసిన ఎంఎల్‌ఎకి అమ్మవారి దేవస్థానము వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవస్థాన ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవం మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూల రథం పైకి అధిరోహింప చేశారు. జాతర మహోత్సవం నిర్వహణ నిమిత్తం దేవస్థానము నుంచి రూ.2 లక్షలు ఎంఎల్‌ఎ చేతుల మీదుగా నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ అధ్యక్షులు రామాయణం గోవింద రావుకి అందజేస్తామని ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఈ కార్యక్రములో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల జనసేన అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, మాజీ ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, టిడిపి నాయకులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 11వ అదనపు జిల్లా జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
GWOP.20/2024
(మైనరు అయిన గుత్తికొండ సిరిచందన స్థిరాస్తి అమ్మకమునకు)

మధ్య
గుత్తికొండ లక్ష్మీనారాయణ ...పిటీషనరు
Vs
నిల్ ...రెస్పాండెంటు

N.R-1 : శ్రీమతి గుత్తికొండ తులసీ రత్నం, W/o.రామారావు, డోర్‌నెం.4-4-8/2, శేష్‌మహల్ వెనుక, సాలిపేట, తాడేపల్లిగూడెం.
N.R-2 : శ్రీ గుత్తికొండ సత్యనారాయణ, S/o.రామారావు, డోర్‌నెం.4-4-8/2, శేష్‌మహల్ వెనుక, సాలిపేట, తాడేపల్లిగూడెం.

ఇందలి పిటీషనరు తనమైనరు కుమార్తె అయిన గుత్తికొండ సిరిచందన యొక్క స్థిరాస్తి అమ్మకమునకు అనుమతి కోరుచూ దాఖలు చేసిన పై GWOP ది.18-07-2024కు వాయిదా అయివున్నందున ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములున్నచో ది.18-7-2024వ తేదీన ఉదయం 10 గం॥లకు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని, కోర్టు కాంపౌండులో గల న్యాయ సేవాధికార సంస్థ వారి సహాయము పొంది గాని హాజరయి తెలుపుకోగలరు. అట్లు కానిచో సదరు విషయము వారి పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

శియ్యాద్రి జగదీశ్వరరావు
తాడేపల్లిగూడెం అడ్వకేటు, ఏలూరు.
ది.27-6-2024 సెల్: 8956899999

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
నూజివీడు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం అర్బన్
రూరల్ కేంద్రాలు: దెందులూరు, పెదవేగి, విజయరాయి, ఏలూరు
పెదపాడు, నిడమర్రు, లింగపాలెం, వేలేరుపాడు, తాడేపల్లిగూడెం
పెంటపాడు, తణుకు, అత్తిలి, ఇరగవరం, నరసాపురం
భీమవరం, ఆకివీడు, మొగల్తూరు
ఇంటర్వ్యూ : తేది: 01-07-24 సోమవారం ఉదయం 9.30 గంటల నుండి
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం:
ప్రజాశక్తి కార్యాలయం, బొలుసువారివీధి, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం: 99493 66196, 89191 70815, 94900 99168, 94900 99190